# సీతమ్మ వాకిట సిరిమల్లె చెట్టు

కథల్లో ట్రాజిడీలు, వున్నట్టు అత్తగార్లలో కొందరు కమీడియన్లుగానూ మరి కొందరు ట్రెజీడియన్లుగానూ లోకంలో నెట్టుకొస్తూంటారు బ్రతుకులు. మన సొసైటీలో అత్తగారూ-సవిత్తల్లి ట్రెడిషనల్ సింబల్స్- ఆర్నెల్ల పసిపాపకుకూడా ముందు వచ్చే మాట "అత్త"—కాని లోకం ఎవరూ అత్తగార్ల గురించి ఒక్క మంచి ముక్క చెప్పిన పాపానపోయినట్లు కనబడదు. అత్తగార్లను దుష్టశక్తులుగా చిత్రించటం సర్వేసర్వత్రా రివాజయిపోయింది (చూడుడు- సూర్యకాంతం పిక్చర్స్). మన సామెతలలోనూ నీతులలోనూ సూక్తులలోనూ అత్తగారిని గురించి మంచి ఎక్కడా లేదు. (కార్టూనిస్టులు సరేసరి)! హైపవర్ కమీషన్స్‌లాగా అత్తగార్లు అథారిటీకి సంకేతాలు.

కత్తి మెత్తనా అత్త మంచీ లేదని త్రోసిపారేశారు.

అత్తగారు "గార్లు' బాగా వండుతారు. కారవు గారె, వుల్లిగారె వుత్తగారె, మసాళా గారె, బెల్లపుగారె మరియు నేతిగారె, గార్లలో ఎన్ని వెరైటీ లున్నాయో - ఫియట్, అంబాసిడర్, హెరాల్డ్, చెవర్లెట్, బ్రూక్స్, వాక్స్‌హాల్, స్టాండర్డ్ దిబ్బా దిరుగుండం అంటూ కార్లలోనూ అన్ని రకా లున్నాయి.

కాంగ్రెస్‌లో అతివాదులూ, మితవాదులూ, కమ్యూనిస్టుల్లో ఉగ్ర వాదులూ అత్యుగ్ర వాదులూ అని వున్నట్లు అత్తగార్లలో కూరగాయ వాదులూ పూరగాయవాదులూ అని రెండు రకా లున్నారు. ఉభయ వర్గాలూ కత్తిపీట ముందేసుకు కూర్చుంటారు. కనుక అహింసా వాదులు పూరగాయ వాదుల ఉద్ఘోష వినిపించుకోరు. కొందరికి కూరలంటే ముఖ్యం, మరి కొందరికి జాడీలూ రాచిప్పలే ముఖ్యం! కోడళ్ళకు

కులకడం ముఖ్యం. అత్తలు అరగదీయాలని చూస్తుంటారు. చితికి పోయిన భూస్వామ్య వ్యవస్థకు కొస మెరుపులాటి గురుతు అత్తగారైతే కోడలు సుత్తీ-కొడుకు కొడవలి. కార్మికులకూ, యజమానులకూమధ్య సంఘర్షణ తప్పనట్లు కోడళ్ళకూ అత్తలకూ మధ్య వర్గ పోరాటం తాలూకు స్వభావం దిగక తప్పదు. అప్పర్ హవుసూ లోయర్ హవుసూ రెండూ రద్దుచేస్తేనేకాని మగాడికి సంసారంలో సుఖ శాంతులు మృగ్యం.

ఎలక్షన్లే మన కంట్రీలో కుల, మత, వర్గ ప్రాతిపదికమీద జరుగుతున్నపుడు, మనదేశంలో ప్రేమ వివాహాలు దావాలకు దారితీసి తగలడి పోక తప్పదు. ఆస్తిపాస్తు లున్నంత కాలం కట్న కానుకలనేవి ఏదో ఒక రూపంలో వుంటాయి. ఇచ్చి పుచ్చుకోడాల బేరసారాలు లేకుండా మ్యారేజీ వ్యాపారం సాగదు. మంగళసూత్రం కట్టడానికి రేటుంటుంది. వివాహం బిజినెస్సయి నప్పుడు దాంపత్యం సక్సెసెలాగవుతుంది ? రిజిష్టర్ పెళ్లిళ్ల తప్ప మంగళ సూత్రం మ్యారేజిస్ చెల్లవని గవర్మెంట్ రూలు పాస్ చేస్తే తప్ప మనకి మోక్షం వుండదు. ప్రేమ వివాహాలనే గవర్మెంట్ ఆమోదించి, సొసైటీ వారిని భక్షించకుండా రక్షణలు కలిపించాలి. సొసైటీని రిఫారమ్ చేయకుండా దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చి నప్పటికీ, ప్రజలకు అది ఏ విధంగానూ ఉపయోగపడదని కనిపెట్టిన వాడు వీరేశలింగం పంతులుగారు, ఇందిరాగాంధీ హయాంలో అది రుజువు చేసి చూపిస్తున్నారు. సామాన్య ప్రజలు చూపిన ఆదరాభిమానాలకు నెహ్రూగారు తన హయాంలో సామాన్య ప్రజలకు చేసిన దేముంది? ఆయన చేయలేనిది ఆయన కూతురు మటుకేం చేస్తుంది ? గాంధీగారు దేశంలోని దరిద్రనారాయణులందర్నీ శ్రీ మంతులగార్డియన్ షిప్‌లో వుంచి వెళ్ళారు ! గార్డియనులు సర్వభక్షకులు కదా ! వారి ఆకలీతీరే దెప్పుడు ? సామాన్యుడి కంటతడి ఆరేదెప్పుడు ?

మొన్న ఫరీదాబాద్‌లో పెండాలు తగలబడిపోయిన మర్రో నిజలింగప్పగారు చెప్పిన సోషలిజం భారతీయ ఆధ్యాత్మిక సోషలిజమే వుంటుంది. పుట్టినప్పుడు మనుష్యులంతా ఒకటే-చచ్చినప్పుడూ ఒంటే,

ఈ మధ్యలో మాత్రం కాదు. ఫ్రీపేపర్సులు చల్లగా వుండాలంటాడు యస్కే పాటిల్. ప్రభుత్వరంగాన్ని చెడగొట్టి ప్రయివేటు రంగాన్ని వుద్ధరిస్తామంటాడు రాజాజీ.

ప్రజాస్వామ్యంలో ప్రజల కర్మ ననుసరించి వారికి నాయకులు లభిస్తారు. నోట్ల వలన వోట్లు, పూర్వ జన్మసుకృతం వలన పదవులు నాయకులకు లభిస్తాయి. (భగవద్గీతలో అంతా సోషలిజమే. దాన్ని అడ్డటం ఎవరితరం?) ఎలక్షన్లకి ముందు వాగ్దానాలూ, అధికారంలోకి వచ్చాక పోలీసులు, లాఠీలు, బాష్పవాయు ప్రయోగాలు, తుపాకీ కాల్పులు యివే రాసిపెట్టి వున్నాయి ప్రజలకు.

ఈ వ్యవస్థను మార్చడం ఎంత కష్టమో ట్రెడిషనల్ అత్తగారిని మార్చడంకూడా అంతే కష్టం.

కోడలు కంటానంటే వద్దనే అత్త వుంటుందా? (సోషలిజాన్ని కంటానంటే ప్రభుత్వం వద్దనే అంటుందా?). పెనిమిటికి ఆశ ఆలిమీద పడక చాపమీద అన్నట్లు వుంది మన పరిస్థితి. నిజమే- ఆవుల్ని మళ్లించినవాడే అర్జునుడు- అర్జునుడు లాంటి నెహ్రూగారే ఆవుల్ని మళ్లించలేకపోయారు.

ఇష్టంలేని పెళ్ళాన్ని ఒసే అన్నా తప్పే అమ్మా అన్నా తప్పే. ఇప్పుడు మనదేశంలో సోషలిజం కావాలన్నా తప్పే! అక్కరలేదన్నా తప్పే? కళ్ళు రెండున్నా కనిపించేదొక్కటే కాబట్టి అందరికీ దృష్టి దానిమీదే వుంది. గుమ్మడి పాదులో చిక్కుకున్న పెళ్లికూతుర్లాగ రమ్మంటే ఎలా వస్తుంది? నిజలింగప్పగారు రమ్మంటే వస్తుందా?

"సీతమ్మ వాకిటా సిరిమల్లె చెట్టు- కొమ్మ వంచకుండ పూలు కోయండి'' అన్నారు ప్రబుద్ధులు. సోషలిజం సీతమ్మ వాకిట వున్న సిరిమల్లె చెట్టు- మరి ఆపూలు ఎవరుకోస్తారో- ఆ దండ ఎవరు గుచ్చుతారో- అది పట్టికెళ్ళి సీతమ్మకిస్తే, రాముడి మెళ్ళోవేస్తుంది. రాముడు రానే వున్నాడు, సీతమ్మ కూర్చుని ఎదురు చూస్తోంది. కొమ్మ వంచకుండా పూలుకోసి దండ కట్టేవారేరి?